సాక్షి
ఖమ్మం

సోమవారం । 2 । సెప్టెంబర్ । 2024



మున్నేరు వరదతో మునిగిన పెదతండా ప్రాంతం

జల దిగ్బంధం



ఖమ్మంలోని చైతన్యనగర్, కవిరాజ్‌నగర్ ప్రాంతాలను చుట్టేసిన వరద

కుండపోత వర్షంతో జిల్లా అతలాకుతలం

- జిల్లాలో 19.6 సెం.మీ. వర్షపాతం నమోదు
- అత్యధికంగా తిరుమలాయపాలెం మండలంలో 33.2 సెం.మీ.
- నాయకన్‌గూడెం వద్ద వరదలో గల్లంతైన భార్యాభర్తలు
- మరిపెడ వరదలో జిల్లాకు చెందిన తండ్రీకుమార్తె మృతి
- ఖమ్మం నగరాన్ని ముంచెత్తిన మున్నేరు
- వాగులు, వంకల ఉప్పొంగడంతో రహదారులపైకి చేరిన నీరు
- మధిర, వైరా, ఖమ్మంలో పర్యటించిన డిప్యూటీ సీఎం భట్టి
- మున్నేటి వరదను పరిశీలించిన మంత్రులు తుమ్మల, పొంగులేటి

ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లుగా కుండపోత వర్షం జిల్లాను అతలాకుతలం చేసింది. జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం 8.30నుంచి ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు 24గంటల్లో సగటున 19.6 సెం.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తిరుమలాయపాలెం మండలంలో 33.2 సెం.మీ వర్షం పడింది. జిల్లా అంతటా రికార్డు స్థాయిలో వర్షం కురవడం, ఎగువన మహబూబాబాద్ జిల్లాలోనూ అతి భారీ వర్షం కారణంగా మున్నేరు, ఆకేరు, వైరా, కట్టలేరు, పాలేరు నదులు పొంగి పొర్లాయి. వరద ఉధృతితో నిరాశ్రయులైన వారి కోసం 39 కేంద్రాలను ఏర్పాటు చేసి 5వేల మందికి ఆశ్రయం కల్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శనివారం అర్ధరాత్రి మధిర చేరుకుని ముంపు బాధితులతో మాట్లాడారు. ఆతర్వాత ఖమ్మంలో కరుణగిరి బ్రిడ్జి వద్ద మున్నేరు వరదను పరిశీలించిన ఆయన అధికారులకు సూచనలు చేశారు. అంతేకాక రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా హుటాహుటిన ఖమ్మం చేరుకుని వెంకటగిరి బ్రిడ్జి వద్ద మున్నేటి వరదను పరిశీలించారు. ఆ తర్వాత ఆయన పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం ప్రకాశ్‌నగర్ బ్రిడ్జి వద్ద సహాయక చర్యలను పర్యవేక్షించారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

ఎగువన కుండపోతతో ..

మహబూబాబాద్ జిల్లాలో కుండపోతగా వర్షం పడడంతో జిల్లాలో పాలేరు, వైరా, కట్టలేరు, ఆకేరు వాగుల్లోకి గతంలో ఎన్నడూ లేనట్లుగా భారీగా వరద చేరింది. ఈ నదులు, వాగులు, వంకలు పొంగిపొర్లడంతో పట్టణాలు, కాలనీలు, గ్రామాలను వరద ముంచెత్తింది. పాలేరు, వైరా, బేతుపల్లి, లంకాసాగర్ అలుగు పడ్డాయి. గత ఇరవై ఏళ్లలో ఎన్నడూ లేనట్లుగా మున్నేరుకు వరద నీరు వచ్చింది. గత ఏడాది జూలైలో గరిష్ఠంగా 30.7 అడుగుల మేర నీళ్లు రాగా ఈసారి ఏకంగా 36.9 అడుగులు వచ్చింది. దీంతో ఖమ్మంలోని పలు కాలనీలు నీటమునిగాయి. అయితే, రాత్రి 11గంటలకల్లా 29.5 అడుగులకు పడిపోయింది.

ఖమ్మం.. అతలాకుతలం

ఖమ్మంలోని మున్నేరు శనివారం సాయంత్రం వరకు ప్రశాంతంగా ఉండగా ఆదివారం తెల్లవారేసరికి పోటెత్తింది. మున్నేటికి రెండువైపులా జలగంనగర్, బొక్కలగడ్డ, దానవాయిగూడెం, రామన్నపేట, వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్, గణేష్‌నగర్, మోతీనగర్, నయాబజార్, రంగనాయకులగుట్ట, పంపింగ్‌వెల్‌రోడ్డు, పెద్దమ్మగుడి ప్రాంతం, ప్రకాశ్‌నగర్, ధంసలాపురం, అగ్రహారం నీట మునిగాయి. ఖమ్మం త్రీటౌన్ ప్రాంతం అంతా మున్నేటి వరద నీటిలో చిక్కుకుంది. అలాగే లకారం చెరువులోకి వచ్చే కాల్వల్లోకి భారీగా వరద నీరు చేరి చైతన్యనగర్‌తో పాటు కవిరాజ్‌నగర్‌లోని 15కాలనీల్లోకి సైతం వచ్చింది.

జిల్లాకు చేరుకున్న మంత్రులు

డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క శనివారం అర్ధరాత్రే మధిర చేరుకొని అక్కడ వరద ప్రభావిత గ్రామాలను పరిశీలించారు. ఆపై వైరా, ఖమ్మంలో పర్యటించారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీసీ ద్వారా వరద సహాయక చర్యలపై సమీక్షించారు. కరుణగిరి వద్ద మున్నేటి వరదను పరిశీలించి.. అధికారులకు సూచనలు చేశారు. ఇక మంత్రి పొంగులేటి వెంకటగిరి వద్ద ప్రకాశ్‌నగర్ బ్రిడ్జి, నాయకన్‌గూడెంతో పాటు పాలేరు అలుగు, ఎన్నెస్పీ కాల్వకు పడిన గండిని పరిశీలించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకాశ్‌నగర్ బ్రిడ్జి వద్ద మున్నేటి వరదను పరిశీలించి సహాయక చర్యల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు.

వరదలో చిక్కుకుని ప్రాణాలు వదిలి..

వరదల కారణంగా ముగ్గురు మృతి చెందగా మరో ఇద్దరు గల్లంతయ్యారు. కారేపల్లి మండలం గంగారం తండాకు చెందిన తండ్రీకుమార్తె నునావత్ మోతీలాల్, అశ్విని ఆదివారం తెల్లవారుజామున కారులో హైదరాబాద్ బయలుదేరారు. వీరు మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయిగూడెం వద్ద వరద నీటిలో చిక్కుకోగా సాయంత్రం అశ్విని మృతదేహం లభ్యమైంది. ఇక మధిర మండలం దెందుకూరులో శనివారం గేదెలు కాసేందుకు వెళ్లిన నన్నెబోయిన పద్మావతి వరదలో గల్లంతై మృతి చెందింది. కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలో పాలేరు వరద నీటిలో భార్యాభర్తలు యాకుబ్, సైదాబి, వీరి కుమారుడు షరీఫ్ గల్లంతయ్యారు. షరీఫ్‌ను పోలీసులు కాపాడినా యాకుబ్, సైదాబీ ఆచూకీ దొరకలేదు. కాగా, జిల్లా వ్యాప్తంగా వరద సహాయక చర్యలను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్ పరిశీలించారు.

వరదలో చిక్కుకున్న వందలాది మంది..

మున్నేరుకు వరద పోటెత్తడంతో ఖమ్మం నగరానికి ఇరువైపులా పరీవాహక ప్రాంత కాలనీల్లోని వేలాది ఇళ్లలోకి నీరు చేరింది. అధికారులు ముందస్తుగా కొందరిని పునరావాస కేంద్రాలకు తరలించారు. అయితే, చాలా మంది తమ ఇళ్ల వరకు వరద రాదనే భరోసాతో శనివారం రాత్రి ఇళ్లలోనే ఉండిపోయారు. కానీ ఆదివారం ఉదయంకల్లా ఇళ్లను వరద చుట్టుముట్టడంతో బయటకు రాలేక భవనాలపైకి చేరుకుని సాయం కోసం ఎదురు చూస్తున్నారు. బంధువులు, పోలీసులు, అధికారులకు ఫోన్లు చేసి తమను కాపాడాలని వేడుకున్నారు. అయితే మహబూబాబాద్ జిల్లాలో ఆదివారం సాయంత్రానికి వర్షం తగ్గడంతో మున్నేరుకు కూడా రాత్రి 11 గంటల తర్వాత వరద కాస్త తగ్గుముఖం పట్టింది. ఈమేరకు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యలను మొదలుపెట్టారు. ఇక రాజీవ్ స్వగృహ ప్రాంతంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహాయక చర్యలను పర్యవేక్షించారు.



అలుగు పారుతున్న పాలేరు రిజర్వాయర్



ఖమ్మం - సూర్యాపేట రహదారిపై వరద

ఆకాశానికి చిల్లుపడిందా...

గత 20 ఏళ్లలో లేనట్లుగా ఎడతెరిపి లేని వాన

ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్లుగా జిల్లా వ్యాప్తంగా కుండపోత వర్షం కురిసింది. శనివారం ఉదయం 8.30 గంటల నుంచి ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు 24గంటల్లో కొన్ని గంటలు భారీగా.. మరికొన్ని గంటలు జల్లులతో కూడిన వర్షం పడింది. గత ఇరవై ఏళ్లలో ఎన్నడూ లేనివిధంగారికార్డు స్థాయిలో జిల్లాలో సగటు వర్షపాతం 19.6 సెం.మీ.గా నమోదైంది. కుండపోత వర్షంతో జిల్లాలోని పాలేరు, వైరా, లంకపల్లి, బేతపల్లి రిజర్వాయర్లు పూర్తిగా నిండి అలుగు పోస్తున్నాయి. అలాగే, సాగర్ ఆయకట్టు పరిధిలోని చెరువులు నిండి అలుగు పోశాయి. భారీ వర్షంతో వాగులు, వంకల్లో వరద ఉధృతి ఎక్కువగా ఉంది. మహబూబాబాద్ జిల్లాలో కురిసిన భారీ వర్షంతో మున్నేరు, పాలేరు, వైరా నదుల్లోకి వరద చేరగా పరీవాహక ప్రాంతంలోని గ్రామాలు, పట్టణాల్లోకి నీరు చేరింది. పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.

తెరిపిచ్చిన వర్షం

జిల్లాలో ఆదివారం ఉదయం 9గంటల తర్వాత వర్షం తెరిపినిచ్చింది. దీంతో రాత్రి 9 గంటల వరకు వర్షపాతం తక్కువగానే నమోదైంది. వంగిడిలో 5.2 సెం.మీ., రావినూతలలో 3.1, వేంసూరు, పమ్మిలో 3 సెం.మీ. చొప్పున, సదాశివునిపల్లిలో 2.9, చింతకానిలో 2.7, ముదిగొండలో 2.7, లింగాలలో 2.5, కొణిజర్లలో 2.2 సెం.మీ. వర్షం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.



లంకాసాగర్ ప్రాజెక్టు అలుగు (డ్రోన్ చిత్రం)



కవిరాజ్‌నగర్‌లో అపార్ట్‌మెంట్లను చుట్టేసిన వరద




ఎటువెళ్లాలో తెలియక వేచిఉన్న బాధితులు



వరదలో చిక్కుకున్న వారి కోసం రోదిస్తూ...



నయాబజార్ నుంచి వస్తున్న స్థానికులు



రేపల్లెవాడలో మృతి చెందిన కోడిపిల్లలు

ప్రకాశ్‌నగర్ బ్రిడ్జిపై తొమ్మిది మంది..



బ్రిడ్జిపై చిక్కుకున్న వ్యక్తులు



బాధితులకు డ్రోన్ ద్వారా లైఫ్‌జాకెట్లు, ఆహారం పంపిస్తున్న దృశ్యం

- రాత్రి వరకు అక్కడే జాగారం
- చివరకు ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది వెళ్లేలోగా బయటకు...

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు వరదతో ఖమ్మం ప్రకాశ్‌నగర్ బ్రిడ్జిపై తొమ్మిది మంది చిక్కుకున్నారు. కట్టెలమండె వాచ్‌మెన్ కుటుంబం, చికెన్ సెంటర్ నిర్వాహకులు, చేపలు విక్రయించే వారు వరదల్లో ఉండిపోయారు. వోగబోయిన శ్రీనివాసరావు, ఆయన కుమారుడు విక్రమ్, వాచ్‌మెన్ మోహన్, ఆయన భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు, వర్కర్లు వినోద్, వెంకన్నతో పాటు మరొకరు ఉన్నారు. వీరు ఆదివారం ఉదయం 9 గంటల నుండి బ్రిడ్జిపైనే వరదలో ఉండగా.. స్పీడ్ బోట్లు, హెలికాప్టర్ వస్తోందని అధికారులు కాలయాపన చేశారని బంధువులు వాపోయారు. పోలీసు అధికారులు ఉదయం నుండి ప్రకాశ్‌నగర్ బ్రిడ్జి వద్ద ఉండి పర్యవేక్షిస్తుండగా, సీపీ సునీల్‌దత్ సమీక్షించారు. రాత్రి 7 గంటల సమయాన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా చేరుకున్నారు. వీరికి భోజనం కూడా తామే డ్రోన్ల ద్వారా పంపించామంటూ బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఈక్రమంలోనే మంత్రి వెళ్లినప్పుడు నిరసన తెలిపారు. దీంతో ఆయన ధైర్యం చెప్పి వెనుదిరిగారు. ఆతర్వాత మంత్రి సూచనలతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ చేరుకున్నారు. మంత్రి కూడా రాత్రి 10గంటల వరకు ఉండి ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని స్పీడ్‌బోట్లతో పంపించారు. కానీ వారు వెళ్లేలోగా తొమ్మిది మంది కనిపించలేదు. ఆ సమయానికే మున్నేరు వరద ఖమ్మం రూరల్ మండలం వైపు తగ్గడంతో అటువైపు వెళ్లిన సిబ్బంది స్థానికులను ఆరా తీయగా బ్రిడ్జిపై చిక్కుకున్న వారు వరద తగ్గగానే నడుస్తూ వచ్చి వెళ్లిపోయారని చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు.

శనివారం ఉదయం 8.30నుంచి ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు మండలాల వారీగా వర్షపాతం (సెం.మీ.ల్లో)

తిరుమలాయపాలెం	కూసుమంచి	మధిర	చింతకాని	ఎర్రుపాలెం	వైరా	తల్లాడ	బోనకల్	ముదిగొండ	కల్లూరు	కారేపల్లి	కొణిజర్ల	ఖమ్మం	నేలకొండపల్లి	రఘునాథపాలెం	ఖమ్మంఅర్బన్	సత్తుపల్లి	కామేపల్లి	వేంసూరు	పెనుబల్లి	ఏన్కూరు
33.02	31.5	28.3	26.2	25.3	24.7	21.8	20.4	20.2	19.7	18.8	18.8	18.1	16.8	16.6	15.3	14.8	14.5	12.8	10.9	10.2



ఎర్రుపాలెం మండలంలో పరిశీలనకు ట్రాక్టర్‌పై వెళ్తున్న డిప్యూటీ సీఎం భట్టి



రాజీవ్ స్వగృహ వద్ద సూచనలు చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రకాశ్‌నగర్ వద్ద వరదలో వెళ్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

న్యూస్‌రీల్

నేడు విద్యాసంస్థలకు సెలవు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. అన్ని పాఠశాలల యాజమాన్యాలు తప్పనిసరిగా సెలవు పాటించాలని ఆయన ఓ ప్రకటనలో ఆదేశించారు.

నేటి ప్రజావాణి రద్దు

ఖమ్మం సహకారనగర్: ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణిని ఈ వారం(నేడు) వాయిదా వేస్తున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. భారీ వర్షాల నేపథ్యాన అధికార యంత్రాంగం సహాయక చర్యల్లో నిమగ్నమైనందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

విద్యుత్ అంతరాయాలు ఎదురుకావొద్దు

నిరంతరం పర్యవేక్షించండి : డిప్యూటీ సీఎం భట్టి

మధిర: భారీ వర్షాల నేపథ్యాన విద్యుత్ అంతరాయాలు ఎదురుకాకుండా చూడాలని, ఎక్కడైనా సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించాలని డిప్యూటీ సీఎం, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, ఎస్ఈలు, డీఈఓలతో మధిర నుంచి ఆదివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నీట మునిగిన సబ్‌స్టేషన్ల వద్ద ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. దెబ్బతిన్న స్తంభాలు, ఇన్సులేటర్లను యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయాలని సూచించిన భట్టి.. ఈ సమయంలో ఉద్యోగులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ సంబంధిత సమస్యలపై ప్రజలు 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. కాగా, సామాజిక బాధ్యతను విస్మరించి విధుల్లో నిర్లక్ష్యం వహించే విద్యుత్ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్న భట్టి... రాత్రీపగలు తేడా లేకుండా విద్యుత్ సరఫరా పనుల్లో నిమగ్నమైన ఉద్యోగులను ప్రశంసించారు.

నిలిచిన ప్రజా రవాణా వ్యవస్థ

రీజియన్‌లో 247 బస్సుల రద్దు



బస్సుల రద్దుతో కొత్త బస్టాండ్‌లో నిద్రిస్తున్న ప్రయాణికులు

ఖమమమయూరిసెంటర్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ముంచెత్తిన వరదల కారణంగా ప్రజా రవాణా వ్యవస్థ స్తంభించింది. ఖమ్మం రీజియన్ నుండి ఏడు డిపోల పరిధిలో 310 ఆర్టీసీ బస్సులకు గాను 247 బస్సులను రద్దు చేశారు. ప్రధాన రహదారులతో పాటు హైదరాబాద్ ప్రాంతానికి ఆర్టీసీ సర్వీసులను నిలిపివేసింది. దీంతో 1,22,301 కి.మీ. మేర సర్వీసులు రద్దయినట్లు అధికారులు వెల్లడించారు. వర్షంతో రైళ్లు రద్దు కాగా, ఇటు బస్సులు సైతం నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

7,090 మందికి పునరావాసం

ఖమ్మం సహకారనగర్: భారీ వర్షాల కారణంగా ముంపు ప్రాంతాల ప్రజలే కాక వరద ముంచెత్తిన కాలనీల నుంచి ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. జిల్లాలోని పలుచోట్ల పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. చింతకాని మండలంలో 150 మంది, ఖమ్మం అర్బన్ మండలంలోని ఐదు కేంద్రాల్లో 5,750 మంది, కూసుమంచి మండలంలో ఏడు పునరావాస కేంద్రాల్లో 698 మంది, మధిరలోని రెండు కేంద్రాలు ఏర్పాటు చేయగా 110 మందికి ఆశ్రయం కల్పించారు. అలాగే, సత్తుపల్లి ఎస్సీ హాస్టల్‌లో 12 మంది, వేంసూరు హాస్టల్‌లో 18 మంది, వైరాలోని పునరావాస కేంద్రంలో 20 మంది, ఎర్రుపాలెంలోని మూడు కేంద్రాల్లో 332 మంది ఉన్నారు.

ముగ్గురు ఏసీపీలకు పదోన్నతి అర్హత

ఖమ్మంక్రైం: ఏసీపీలుగా విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురికి అడిషనల్ ఎస్పీలుగా పదోన్నతి అర్హత లభించింది. ఖమ్మం సీసీఆర్‌బీలో పనిచేస్తూ ఇటీవల బదిలీ అయిన ప్రసన్నకుమార్‌తో పాటు సత్తుపల్లి ఏసీపీ రఘు, స్పెషల్ బ్రాంచ్ సెక్యూరిటీ వింగ్‌లో పనిచేస్తున్న వెంకటేష్‌ను అర్హులుగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

క్లుప్తంగా

వరద ప్రభావంపై కేంద్ర మంత్రి దృష్టికి..

ఖమ్మం మామిళ్లగూడెం: జిల్లాలో భారీ వర్షాలు, వరదల నేపథ్యాన నెలకొన్న పరిస్థితులను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దృష్టికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీసుకెళ్లారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ తెలిపారు. జిల్లాలో 110 గ్రామాలు ముంపునకు గురి కాగా, ఖమ్మం ప్రకాశ్‌నగర్ గుట్టపై 9మంది, పాలేరు నియోజకవర్గంలోని అజ్మీరతండా గుట్టపై 68మంది, భవనాలపై 42మంది చిక్కుకున్న విషయాన్ని అమిత్‌షాకు వివరించినట్లు వెల్లడించారు. ఈనేపథ్యాన చెన్నై, వైజాగ్, అసోం నుండి మూడు చొప్పున తొమ్మిది ఎన్డీఆర్ఎఫ్ బృందాలను తెలంగాణకు పంపించగా, సహాయక చర్యలపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో ఫోన్‌లో చర్చించారని తెలిపారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



నిరసనలో పాల్గొన్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) రద్దు చేయాలని ఆదివారం పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలన్న రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. టీఎన్జీవోస్ కోకన్వీనర్లు కొణిదన శ్రీనివాస్, జైపాల్, టీజీవోస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, టీపీటీఎఫ్, యూటీఎఫ్, ఎస్టీఎఫ్, పీఆర్‌టీయూ తదితర సంఘాల నాయకులు పి.నాగిరెడ్డి, పారుపల్లి నాగేశ్వరరావు, దేవరకొండ సైదులు, యలమద్ది వెంకటేశ్వర్లు మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టిన నేపథ్యాన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే అమలుచేయాలని కోరారు. ఆయా సంఘాల నాయకులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, రంగారావు, యాదగిరి, మన్సూర్, సతీష్, వెంకటేశ్వర్లు, బిక్కు, లక్ష్మణరావు, మీరా, రాజేష్ చెర్ల శ్రీనివాసరావు, శ్రీనివాస్, దుర్గాప్రసాద్, శ్రీధర్ సింగ్, తాళ్లూరి శ్రీకాంత్, రవిచంద్ర, పూసపాటి శ్రీను, అంజనేయులు పాల్గొన్నారు.

ఎంబీఏలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని కాకతీయ యూనివర్సిటీ అనుబంధ పీజీ కళాశాలలో ఎంబీఏ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చేకూరి రవికుమార్ తెలిపారు. ఇటీవల ఐసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఈనెల 3 నుంచి మొదలయ్యే వెబ్ ఆప్షన్లలో తమ కళాశాల కోడ్(కేయూకేహెచ్ఎస్ఎఫ్)ను మొదటి ప్రాధాన్యతగా ఎంచుకుంటే ప్రవేశాలు పొందొచ్చని తెలిపారు. ఈ విభాగంలో 50 సీట్లు ఉన్నందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 93464 43578, 94406 52571 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కేయూ దూరవిద్య ప్రవేశాలకు గడువు పెంపు

కాకతీయ యూనివర్సిటీ పరిధి సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (గతంలో ఎస్‌డీఎల్‌సీఈ)లో డిగ్రీ, పీజీ, డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు యూనివర్సిటీ పీజీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ గోపి తెలిపారు. ఫీజు, అర్హతలు ఇతర వివరాల కోసం అధ్యయన కేంద్రం నంబర్ 80088 11998 లేదా కేయూ దూరవిద్య కేంద్రం వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు.

సంక్షేమ అధికారుల నిర్లక్ష్యం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరాన్ని ముంచెత్తి నయాబజార్ సమీపాన ఎస్సీ, బీసీ సంక్షేమ వసతిగృహాల చుట్టూ నీరు చేరింది. దీంతో బీసీ వసతిగృహం విద్యార్థులను అధికారులు బయటకు తరలించగా.. ఎస్టీ మహిళా వసతిగృహంలో విద్యార్థినుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. విద్యార్థినులకు భోజనం, తాగునీరు ఇబ్బంది పడ్డారు. గిరిజన సంక్షేమ అధికారి కనీసం పట్టించుకోలేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక ఎస్సీ బాలుర 'ఏ' వసతిగృహంలోకి వరద చేరడంతో అధికారులు హుటాహుటిన విద్యార్థులను మరో ప్రాంతానికి తరలించారు.

57 వేల ఎకరాల్లో పంటలు వర్షార్పణం

వ్యవసాయ, ఉద్యాన శాఖల ప్రాథమిక అంచనా

ఖమ్మంవ్యవసాయం: భారీ వర్షాల కారణంగా జిల్లాలో 37,716 మంది రైతులకు చెందిన 57,410 ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. జిల్లాలోని 188 గ్రామాల్లో వర్షప్రభావం ఉండడంతో వాగులు, వంకలు, జలాశయాలు ఉప్పొంగి వరద నీరు పంట చేలల్లోకి చేరింది. అంతేకాక ఈదురుగాలులకు పత్తి, మొక్కజొన్న వంటి పంటలు నేల వాలాయి. అరటి, బొప్పాయి వంటి పంటలు ధ్వంసమయ్యాయి. కొన్నిచోట్ల పంట పొలాల్లో ఇసుక మేటలు వేశాయి.

53 వేల ఎకరాల్లో వ్యవసాయ పంటలు..

జిల్లాలో 34,993 మంది రైతులకు చెందిన పత్తి, వరి, మొక్కజొన్న, పెసర వంటి పంటలు 53,001 ఎకరాల్లో నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా గుర్తించింది. 20,130 మంది రైతులకు చెందిన వరి 28,207 ఎకరాల్లో, 14,641 మంది రైతులకు చెందిన పత్తి 24,791 ఎకరాల్లో, 25 మంది రైతులకు చెందిన మొక్కజొన్న 47 ఎకరాల్లో, 197మంది రైతులకు చెందిన పెసర 470 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు తేల్చారు. అలాగే, 2,723 మంది రైతులు సాగు చేస్తున్న 4,409 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని నివేదిక రూపొందించారు. ప్రధానంగా 145 మంది రైతులకు చెందిన మిర్చి 2,532 ఎకరాల్లో, 155 మంది రైతులకు చెందిన కూరగాయలు 131 ఎకరాల్లో, 13 మంది రైతులకు చెందిన అరటి 32 ఎకరాలు, 23 మంది రైతులకు చెందిన బొప్పాయి 68 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా గుర్తించారు.



ఎర్రుపాలెం మండలంలోని పత్తి చేనులో చేరిన వర్షపు నీరు

డివిజన్ల వారీగా పంట నష్టం (ఎకరాల్లో)

డివిజన్	రైతుల సంఖ్య	పంటలు
ఖమ్మం	1,196	1,665
కూసుమంచి	11,585	15,577
మధిర	22,595	35,251
సత్తుపల్లి	296	426
వైరా	2,044	4,491
మొత్తం	37,716	57,410

విద్యుత్ శాఖకు తీవ్రనష్టం

- జల దిగ్బంధంలో సబ్ స్టేషన్లు
- విరిగిపడిన స్తంభాలు, కూలిన ట్రాన్స్‌ఫార్మర్లు
- సబ్‌స్టేషన్‌లో చిక్కుకున్న ఆపరేటర్‌ను రక్షించిన ఉద్యోగులు



జల దిగ్బంధంలో చిక్కుకున్న దానవాయిగూడెం సబ్ స్టేషన్



పాలేరు సబ్ స్టేషన్‌లో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్ఈ సురేందర్

ఖమ్మంవ్యవసాయం: భారీ వర్షాలతో విద్యుత్ శాఖకు తీవ్రనష్టం వాటిల్లింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీవర్షం కురవడంతో జిల్లాలోని స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు కూలిపోయాయి. అలాగే, పలుచోట్ల సబ్ స్టేషన్లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఈదురుగాలులు, వర్షానికి సబ్ స్టేషన్లు, లైన్లు ధ్వంసం కావడంతో విద్యుత్ శాఖకు భారీ నష్టం ఏర్పడింది. శనివారం అర్ధరాత్రి సరఫరా నిలిచిపోవడంతో అనేక ప్రాంతాలు అంధకారంలో మగ్గుతున్నాయి. కొన్నిచోట్ల ఆదివారం రాత్రి వరకు సరఫరా పునరుద్ధరించలేకపోయారు.

సబ్‌స్టేషన్లలోకి వరద

ఖమ్మం ప్రకాష్‌నగర్, దానవాయిగూడెం, ఖమ్మం రూరల్ మండలంలోని మంగళ తండా, పాలేరు(నర్సింహులపేట), మధిర సబ్ స్టేషన్లలోకి వరద చేరగా జల దిగబ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో ఆయా సబ్ స్టేషన్ల పరిధి ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోయింది. మధిర సబ్ స్టేషన్‌కు ప్రత్యామ్నాయంగా జీలుగుమడుగు విద్యుత్ లైన్ లింక్ చేసి సరఫరా ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. పాలేరు సబ్‌స్టేషన్‌కు కూసుమంచి సబ్ స్టేషన్‌నుంచి సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారు.

ఆపదలో ఆపరేటర్

ఖమ్మం దానవాయిగూడెం సబ్ స్టేషన్‌లోకి వరద చేరడంతో అక్కడి ఆపరేటర్ సురేష్ చిక్కుకుపోయాడు. మున్నేరు వరద ఉధృతి పెరగడంతో ఆయన బయటకు రాలేక కంట్రోల్‌రూమ్ భవనంపైకి ఎక్కి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాడు. అయితే, రెస్క్యూ బృందాలు చేరుకునే పరిస్థితి లేక ఆయన ఆదివారం రాత్రి వరకు అక్కడే ఉన్నాడు. అయితే, రాత్రి 7 గంటల తర్వాత వరద తగ్గటంతో శాఖ చెందిన ఉద్యోగులు ముగ్గురి సాహసం చేసి కంట్రోల్ రూమ్ వద్దకు చేరుకొని సురేష్‌ను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఈమేరకు ఉద్యోగులను ఎస్ఈ సురేందర్, డీఈ రామారావు, ఏఈ మాల్విక అభినందించారు.

రూ.25 లక్షల విలువైన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు నష్టం

భారీవర్షాలతో ఖమ్మం సర్కిల్ పరిధిలో రూ.25లక్షల విలువైన 80 విద్యుత్ స్తంభాలు, 25 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. జల దిగబ్బంధంలో ఉన్న సబ్ స్టేషన్లలో జనరేటర్లు, యంత్రాల పనితీరును గుర్తించిన తర్వాత నష్టంపై స్పష్టత వస్తుందని చెబుతున్నారు. ఈ మేరకు ఎస్ఈ సురేందర్ మాట్లాడుతూ పలు సబ్ స్టేషన్ల పరిధిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యామని తెలిపారు.

విశాఖపట్నం నుంచి హెలికాప్టర్?



సీఎస్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం

మధిర: జిల్లాలో మున్నేరు వాగు వరద ఉధృతితో ఖమ్మం ప్రకాష్ నగర్, తీర్థాల, వాల్యతండాలో కొందరు చిక్కుకుపోయారు. వీరిని రక్షించడానికి సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. అంతేకాక హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ పంపించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి ఫోన్‌లో సూచించారు. అయితే, హైదరాబాద్‌లోనూ వర్షాలతో హెలికాప్టర్ రాలేని పరిస్థితి ఉండడంతో విశాఖపట్నం నుంచి తెప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో విశాఖపట్నం నుంచి నేవల్ బేస్ డిఫెన్స్ అధికారులతో మాట్లాడి హెలికాప్టర్ పంపించాలని కోరారు. ఈమేరకు ఖమ్మం కలెక్టర్‌ను అక్కడి అధికారులతో సమన్వయం చేస్తున్నారు.

ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం..

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

నేలకొండపల్లి: వరదల నుంచి ప్రజలను కాపాడేందుకు జిల్లా యంత్రాంగం తీవ్రంగా శ్రమిస్తోందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి, సీఎస్ శాంతికుమారి నిర్వహించిన వీసీకి ఆయన నేలకొండపల్లి తహసీల్ నుంచి హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజలను అప్రమతం చేసినట్లు తెలిపారు. ముంపు ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారని చెప్పారు. ముంపు ప్రాంతాల ప్రజలను పునరావస కేంద్రాలను చేర్పినట్లు తెలిపారు.

ఖమ్మం మీదుగా వెళ్లే పలు రైళ్ల రద్దు



ఖమ్మం బైపాస్ రోడ్డు వద్ద ఉన్న ట్రాక్‌పై నిలిచిన వర్షపు నీరు

- మరికొన్నింటి దారి మళ్లింపు
- సాయంత్రం తర్వాత వేగం తగ్గించి నడిపిన అధికారులు



ఖమ్మం స్టేషన్‌లో పట్టాలపై నిలిచిన వర్షపు నీరు

ఖమ్మం రాపర్తినగర్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పలుచోట్ల ట్రాక్‌లపైకి నీరు చేరగా.. ఇంకొన్ని చోట్ల ట్రాక్‌లు దెబ్బతిన్నాయి. ఖమ్మం రైల్వేస్టేషన్‌లోకి పట్టాలపై నీళ్లు నిలిచాయి. అయినప్పటికీ ట్రాక్ దెబ్బతినకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇక ఖమ్మం మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేశారు. ఇంకొన్నింటిని దారి మళ్లించి నడిపిస్తున్నారు. ఆదివారం వెళ్లాల్సిన శాతవాహన, గోల్కొండ, మచిలీపట్నం, సింహపురి, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌రైళ్లు రద్దు చేశారు. ఇక శాలిమార్, కాప్రా, గూడూరు వెళ్లాల్సిన మచిలీపట్నం, హైదరాబాద్-నర్సాపూర్, విశాఖ-హైదరాబాద్, అండమాన్, కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను దారి మళ్లించినట్లు ఖమ్మం రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎం.డీ.జాఫర్ తెలిపారు. అయితే, సాయంత్రం తర్వాత కొన్ని రైళ్లను వేగం తగ్గించి నడిపించారు.

రైల్వేస్టేషన్ వెలవెల

ఖమ్మం రైల్వేస్టేషన్ మీదుగా వెళ్లే రైళ్లను రద్దు చేయడం, కొన్నింటిని దారి మళ్లించిన నేపథ్యాన స్టేషన్‌కు ఎవరూ రాకపోవడంతో వెలవెలబోయి నిపించింది. కాగా, మచిలీపట్నం - బీదర్ ఎక్స్‌ప్రెస్ ఖమ్మంలో గంటల తరబడి ఆగడంతో ప్రయాణికులు తీవ్రఇక్కట్లకు గురయ్యారు. ఇక దూరప్రాంతాలకు వెళ్లేందుకు వచ్చిన వారు రైళ్ల కోసం నిరీక్షించగా.. మరికొందరు వెనుదిరిగారు. అలాగే, దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు రైళ్ల రద్దు కావడంతో రిజర్వేషన్ రద్దు చేసుకున్నారు.

వరద సహాయక చర్యల్లో ఎంపీ రఘురాంరెడ్డి



ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ఖమ్మం మున్నేరు, లకారం పరిసర ప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ఉదయం నుండి ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ పరిస్థితులను సమీక్షించారు. ఆయా ప్రాంతాల్లో వరద ప్రభావాన్ని సీఎం రేవంత్‌రెడ్డికి ఫోన్‌లో తెలిపారు. అలాగే, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడి వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలపై ఆరా తీశారు. ఖమ్మంలోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్, జూబ్లీక్లబ్, కాల్వొడ్డు, పాలేరు నియోజకవర్గంలోని కరుణగిరి, జలగంనగర్, నాయుడుపేట, రాజీవ్ గృహకల్ప, పోలెపల్లి తదితర ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడిన ఎంపీ.. వీలైనంత త్వరగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.

వృద్ధులను కాపాడిన యువకులు



ఖమ్మంలో వృద్ధురాలిని తీసుకొస్తున్న యువకులు



సుర్దేపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని తీసుకెళ్తున్న స్థానికులు

ఖమ్మంక్రైం/నేలకొండపల్లి: ఖమ్మంలో మున్నేరు భారీగా వరద రావడంతో పంపింగ్ వెల్ రోడ్డులోని పెద్దమ్మతల్లి దేవాలయం సమీపానికి నీరు చేరింది. దీంతో ఇళ్లు మునిగిపోగా అక్కడ నివసిస్తున్న వృద్ధురాలు ఆకిటి కోటమ్మ ఆర్తనాదాలు చేస్తుండడంతో స్థానిక యువకులు ఆమెను మంచంతో సహా ఎత్తుకుని సురక్షిత ప్రాంతానికి తీసుకొచ్చారు. అలాగే, నేలకొండపల్లి మండలం సుర్దేపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని స్థానికులు మంచంతో పాటు సొసైటీ గోడౌన్‌లో ఏర్పాటుచేసిన పునారావాస కేంద్రానికి తీసుకురావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కేజీబీవీలోకి వరద



భవనం రెండు, మూడో అంతస్తుల్లో నిల్చున్న విద్యార్థినులు



పిల్లలను తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

కారేపల్లి: మండల కేంద్రంలోని కారేపల్లి – ఇల్లెందు ప్రధాన రహదారిలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ఎదుట లో లెవల్ కల్వర్టు పైనుంచి మద్దులవాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో కేజీబీవీలోకి వరద చేరడంతో విద్యార్థినులు ఆందోళనకు గురయ్యారు. విద్యార్థినులు రెండు, మూడో అంతస్తుల్లోకి పరుగులు తీయగా, పోలీసులు, గ్రామపంచాయతీ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, స్థానికులు చేరుకుని వారికి ధైర్యం చెప్పారు. ఆతర్వాత తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు చేరుకుని పిల్లలను తీసుకెళ్లారు. ఇక కారేపల్లి రైల్వే క్వార్టర్స్ సమీపాన నిర్మించిన ప్రహరీ కారణంగా వివిధ వాడల నుంచి వచ్చిన వరద శివాలయం వద్ద పోటెత్తింది. సుమారు ఐదు అడుగుల మేర నీరు చేరగా ప్రహరీకి రంధ్రం చేయడంతో వరద తగ్గుముఖం పట్టింది.

కలెక్టర్ క్యాంప్ ఆఫీస్‌కు వరద తాకిడి

ఖమ్మం సహకారనగర్: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ ప్రాంతానికి వరద నీరు చేరింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మున్నేరు ఉప్పొంగుతుండగా పరీవాహక ప్రాంతాల్లోకి వరద వస్తోంది. అక్కడి సమీపానే కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ ఉండటంతో కొద్దిమేర నీరు అటువైపు చేరినా ఆతర్వాత తగ్గుముఖం పట్టింది.

వరదలో కొట్టుకుపోతున్న వ్యక్తిని కాపాడిన పోలీసులు



సూరిబాబును కాపాడిన పోలీసులు

చింతకాని: చింతకాని-నేరడ మధ్య ఉన్న దాసరి బంధం వరద నీటిలో ఓ వ్యక్తి కొట్టుకుపోతుండగా సిబ్బంది సాయంతో ఎస్సై నాగుల్‌మీరా కాపాడారు. ఏపీలోని ఏలూరు జిల్లా గుడివాడ లంక గ్రామానికి చెందిన సూరిబాబు బతుకుదెరువు కోసం చింతకానికి వచ్చి తుమ్మలమ్మ చెరువుపై కాపలాగా ఉంటున్నాడు. నేరడ నుంచి ఆదివారం ఆయన చింతకానికి వస్తుండగా రహదారిపై దాసరి బంధం వద్ద వరద ఉధృతిలో కొట్టుకుపోసాగాడు. మధ్యలో ఆసరాగా దొరికిన చెట్టును పట్టుకుని కేకలు వేయడంతో స్థానికులు గమనించి ఎస్సైకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్సై తన సిబ్బందితో చేరుకుని సూరిబాబు ను సురక్షితంగా బయటకు తీసుకొచ్చాశారు.

తడిసి ముద్దయిన పెద్దాస్పత్రి



ఆస్పత్రి వరండాలో కురిసిన వర్షపునీరు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి ఆవరణ అంతా జలమయమైంది. వర్షపు నీరు పైకప్పుల నుండి కారడంతో ఆస్పత్రి ఆవరణ తడిసి ముద్దయింది. పలు వార్డుల్లో వర్షపు నీరు నిలవడంతో తొలగించేందుకకు పారిశుద్ధ్య సిబ్బంది శ్రమించాల్సి వచ్చింది. అయినా పైకప్పుల నుండి కారుతున్న నీటితో ఇన్‌పేషంట్లు ఇబ్బంది పడ్డారు. అంతేకాకు భారీ వర్షంతో శనివారం అర్ధరాత్రి పలుమార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జనరేటర్లు ఉన్నప్పటికీ జోరు వర్షం కారణంగా వినియోగించుకోలేకపోయారు.



నయాబజార్‌లోని బీసీ హాస్టల్‌లో వరదనీరు



చైతన్యనగర్‌లోని ఫుట్‌వేర్ షాప్‌లో వరద..



సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న మంత్రి తుమ్మల, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్





రాజీవ్ గృహకల్ప, ప్రకాశ్‌నగర్ బ్రిడ్జి వద్ద సహాయక చర్యల్లో మంత్రి పొంగులేటి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ



బోట్‌తో వెళ్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

డెంగీతో బీటెక్ విద్యార్థిని మృతి



మేకల స్వాతి(ఫైల్)

కల్లూరురూరల్: కల్లూరులోని అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన బీటెక్ విద్యార్థిని మేకల స్వాతి(19) డెంగీ బారిన పడి మృతి చెందింది. కాలనీకి చెందిన మేకల ఆదినారాయణ కుమార్తె స్వాతి హైదరాబాద్‌లో బీటెక్ చివరి సంవత్సరం చదువుతోంది. ఇటీవల స్వస్థలానికి వచ్చిన ఆమెకు జ్వరం రాగా పరీక్షల్లో డెంగీగా తేలడంతో హైదరాబాద్ తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం ఉదయం ఆమె మృతి చెందింది.

గల్లంతైన మహిళ...

మధిర: మధిర మండలం దెందుకూరులో పశువులను మేతకు తీసుకెళ్లి వస్తుండగా వరద ప్రవాహానికి గల్లంతైన మహిళ మృతదేహం లభ్యమైంది. గ్రామానికి చెందిన నన్నెబోయిన పద్మావతి(34) శనివారం ఉదయం పశువులను తీసుకెళ్లి సాయంత్రం వస్తున్న క్రమంలో దెందుకూరు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద ప్రవహిస్తోంది. పశువులు క్షేమంగా ఒడ్డుకు చేరడంతో తాను సైతం వెళ్లొచ్చని నీటిలోకి దిగిన ఆమె వరద వేగానికి కొట్టుకుయింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శనివారం రాత్రి వరకు గాలించినా ఆచూకీ లేకపోగా ఆదివారం ఉదయం సమీపంలో పద్మావతి మృతదేహం లభ్యమైంది. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

సుజాతనగర్: తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటనపై సుజాతనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఎస్సై జుబేదాబేగం కథనం ప్రకారం... సీతంపేట బంజర గ్రామానికి చెందిన నూనావత్ నాగేశ్వరరావు(33) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మతిస్థిమితం కోల్పోయిన ఆయన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.